యోగాతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మానసిక ఒత్తిడిని తగ్గించి, ఉల్లాసంగా ఉంచే చక్కటి ప్రక్రియ యోగా అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలో మెకానిక్ టెంపుల్ వద్ద యోగాసనాలు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి అందరితో యోగాసనాలు వేయించారు. అనంతరం ర్యాలీని చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

డామిట్ కథ అడ్డం తిరిగింది. నాడు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను బదిలీ చేయాలంటూ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు చేశారు. అయినా అదరని బెదరని కలెక్టర్.. నేడు బదిలీ కోసం తానే స్వయంగా సిఎంఒను ఆశ్రయించారట. దీంతో జిల్లా అడ్మినిస్ట్రేషన్ వర్సెస్ కొందరు పొలిటికల్ లీడర్స్ అన్నట్టుగా సాగుతుందా? అంటే చాలా మంది నోట అవుననే సమాధానమే వినిపిస్తోంది.

- నాడు బదిలీ ఫిర్యాదులను పట్టించుకోని ప్రభుత్వం
- నేడు బదిలీ కోసం ప్రయత్నిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఏకంగా సిఎంఒని ఆశ్రయించిన వైనం
- జిల్లాలో ఏం జరుగుతోంది?

డామిట్..! కథ అడ్డం తిరిగింది

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలా జిల్లాల్లో కలెక్టర్ల మార్పు జరిగిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా విజయనగరం జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గత ఏడాది జూన్ 25వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల క్రితం వరకూ అంతా సఖ్యతగానే సాగింది. ఆ తరువాత జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను బదిలీ చేయాలంటూ టిడిపి యువనేత, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారట. అయినా పట్టించుకోకపోవడంతో మరో రెండు సార్లు లోకేష్‌ను కలిసినా ప్రయోజనం లేకపోయిందని సమాచారం. ఈ మొత్తం వ్యవహారం తిరిగి కలెక్టర్ వరకు చేరినప్పటికీ వాటిని పెద్దగా పట్టించుకోలేదు. గత నెలలో ఐఎఎస్‌ల బదిలీలపై ప్రభుత్వం తీవ్రమైన కసరత్తు కూడా చేసినప్పటికీ బదిలీల జాబితాలో కలెక్టర్ పేరు కూడా లేకపోవడంతో లైన్ క్లియర్ అయినట్టుగా అయ్యింది. తాజాగా కథ అడ్డం తిరిగింది. నాడు తనపై ఫిర్యాదులు చేసినా తగ్గేదేలే అన్నట్టుగా ఉన్న కలెక్టర్ తాజాగా బదిలీ కోసం పావులు కదుపుతున్నారు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.... పది రోజుల క్రితం కలెక్టర్ ఏకంగా సిఎంఒ కార్యాలయంలోనే బదిలీ అభ్యర్థన పెట్టారు. ఇంతలోనే అంతమార్పు వెనుక జిల్లా అడ్మినిస్ట్రేషన్, ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య కోల్డ్‌వార్ సాగుతున్నట్టుగా తెలుస్తోంది. వాస్తవానికి విజయనగరం జిల్లా కలెక్టర్‌గా అంబేద్కర్‌ను సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఏరికోరి పంపారు. ప్రభుత్వం మారిన వెంటనే ఏదో ఒక శాఖకు ఉన్నతాధికారిగా పనిచేయాలని ఉద్దేశంతో ఆయన పావులు కదిపారు. సిఎంఒ సూచన మేరకు ఆయన పేరు కలెక్టర్ల జాబితాలో చేరింది. దీంతో ఆయన కాకినాడ జిల్లావైపు మొగ్గుచూపారట. కానీ, ఉమ్మడి విజయనగరం జిల్లాలో పూర్వం ఆర్‌డిఒగా, ఐటిడిఎ పిఒగా పనిచేసిన అనుభవం ఉండడంతో సిఎం చంద్రబాబు మన జిల్లాకు ప్రత్యేకించి పంపారు. బహుశా అందువల్లేనేమో ప్రజాప్రతినిధులు చేసిన ఫిర్యాదును కూడా అప్పట్లో లోకేష్ పక్కన పడేశారు. అప్పట్లో ఒకింత దీమాగా ఉన్న కలెక్టర్, ప్రస్తుతం బదిలీ కోసం ప్రయత్నించడం వెనుక కారణాలేమిటి? అన్న దానిపై లోలోపల చర్చ నడుస్తోంది. అంబేద్కర్ బదిలీ కోసం ప్రయత్నిస్తున్నందున మంత్రి లోకేష్ అందుకనుగుణంగా గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేక జిల్లాలో అంబేద్కర్ అవసరం ఉందంటూ ఇక్కడే కొనసాగాలని అదేశిస్తారా? అన్నది వేచిచూడాల్సిందే.

బొండపల్లిలో రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ; విజయనగరంలో వృద్ధురాలి ఇంటికెళ్లి రేషన్ అందజేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

అక్రమాలు నిరోధించేందుకే

రేషన్ షాపుల పునరుద్ధరణపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి, శృంగవరపుకోట

ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలు నిరోధించేందుకే ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేపట్టాలని నిర్ణయించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రజాభిప్రాయం తెలుసుకున్న తర్వాతే ఈ వ్యవస్థను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. బొండపల్లి, శృంగవరపుకోట మండలాల్లో నూతన రేషన్ షాపుల ప్రారంభోత్సవంలో ఆదివారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దకే రేషన్ డీలర్లు సరుకులను తీసుకెళ్లి అందజేస్తారని చెప్పారు. ప్రతి నెలలో ఐదో తేదీ లోపల వృద్ధులకు ఇంటికే రేషన్ సరుకులు అందజేయాలని ఆదేశించామన్నారు. జిల్లాలో 65,906 మంది వృద్ధులకు ఇంటివద్దకే సరుకులు అందజేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1249 రేషన్ షాపులను నేడు ప్రారంభిస్తున్నామని, ఈ షాపుల ద్వారా 5,71,358 మంది కార్డుదారులకు రేషన్ సరఫరా చేస్తామని వివరించారు. రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా 15వ తేదీలోగా సరుకులు సరఫరా చేయాలని డీలర్లకు ఆదేశాలిచ్చామని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచి సరుకులు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. అన్ని రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి దానిపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చని డిఎస్ఒ మదుసూధనరావు చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి మదుసూధనరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వి.రాజేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ గోపాలరాజు, టిడిపి నాయకులు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, బండారు బాలాజీ, కోరాడ కృష్ణ, ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డిపోలకు రాలేని వారికి ఇంటి వద్దకే రేషన్

కంటోన్మెంట్ : 65 ఏళ్లు దాటిన వృద్ధులు తదితర రేషన్ డిపోలకు రాలేని వారికి ఇంటి వద్దకే సరుకులను పంపిస్తామని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. విజయనగరంలోని కెఎల్ పురం, కణపాక, కంటోన్మెంట్ రేషన్ షాపులను ఆదివారం కలెక్టర్ ప్రారంభించారు. లబ్ధిదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. కెఎల్ పురంలో 65 ఏళ్లు దాటిన కార్డుదారు మజ్జి సావిత్రమ్మ ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ స్వర్ణకుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ రామారావు, కెఎల్‌పురం కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి కుమారి, రేషన్ డీలర్ మామిడి సూర్యకుమారి పాల్గొన్నారు.

కణపాకలో రేషన్‌షాప్‌ను ప్రారంభించిన జెసి

విజయనగరంటౌన్ : నగరంలోని కణపాక ప్రాంతంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఏర్పాటు చేసిన 98వ నెంబర్ రేషన్ షాపును జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్ షాపులో నిత్యావసర సరుకుల పంపిణీకి చేసిన ఏర్పాట్లను ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో రేషన్ సరుకులు పంపిణీ తప్పనిసరిగా చేయాలని, వేళలు కచ్చితంగా పాటించాలని డీలర్‌ను ఆదేశించారు. జెసి వెంట డిఎస్ఒ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా
- పాఠ్య, నోట్‌పుస్తకాలపై అడ్డగోలు వ్యాపారం
- వేలకు వేలు దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ

తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒక్క ఆశ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు.. మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ.. అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి.

ప్రయివేటు దోపిడీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ.. ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి, దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో 500కు పైగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లపైనే లెక్కపెట్టవచ్చు. మౌలిక వసతుల లేమి, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా... గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రయివేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కెజి, యుకెజి తరగతులకే రూ.4 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై ఎస్ఎఫ్ఐ నాయకులు దాడులు చేస్తూ పట్టిస్తే, నామమాత్రంగా అధికారులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారు. అంతేతప్ప దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు.

ఇదీ ఫీజుల లెక్క

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్డగోలుగా ఫీజులు పెంచేసి, విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో రూ.7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ.10 వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4, 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరోతరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, పట్టణాల్లో రూ.11,100 చొప్పున పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులను నిర్ణయించారు. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఎఎస్ అధికారులతో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు ఒకటి నుంచి పదో తరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. ఫీజు వసూలు, సౌకర్యాల వంటి వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి, కానీ ఈ నిబంధనలను ప్రయివేటు పాఠశాలలు పాటించడం లేదు.

లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది పలు ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగిస్తున్నారు. జెసిబిలు, బాబ్ కార్టుల సహాయంతో చెత్తాచెదారాలను తొలగించి వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చేస్తున్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని సమాచారం వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాలకు సిబ్బందిని పంపించి యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. కాలువల్లో పూడిక చేరడానికి వ్యర్థాలు పారబోయడమే కారణమన్నారు. ప్రజలు సహకరించి కాలువల్లో, రహదారులపై చెత్తా చెదారాలను వేయరాదని సూచించారు.

హోటల్ వద్ద కుటుంబ సభ్యులతో తహశీల్దార్ కూర్మనాథరావు

సిక్కింలో చిక్కుకున్న తహశీల్దార్ కుటుంబం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సిక్కింలో వరదల్లో విజయనగరం తహశీల్దార్ ఆర్.కూర్మనాథరావు చిక్కుకున్నారు. సిక్కిం రాష్ట్రానికి తహశీల్దార్ కుటుంబంతో కలిసి వెళ్లారు. వరదల్లో రోడ్డు కొట్టుకుపోవడంతో తహశీల్దార్ కూర్మనాథరావు కుటుంబం అక్కడే హిల్ టాప్‌లోని ఓ హోటల్లో ఆదివారం క్షేమంగా ఉంది. సోమవారానికి వారంతా విజయనగరం చేరుకోవాల్సి ఉందని సిబ్బంది చెబుతున్నారు. తహశీల్దార్ కుటుంబాన్ని తీసుకొచ్చేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చర్యలు చేపట్టినట్లు సమాచారం. సిక్కిం డిజిపి, ఇతర అధికారులతో రామ్మోహన్ నాయుడు మాట్లాడినట్లు తెలిసింది. తహశీల్దార్ కూర్మనాథరావుతో ఫోన్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడారు. ఆయన కుటుంబం క్షేమ సమాచారంపై ఆరా తీశారు. తన కుటుంబం సురక్షితంగా ఉన్నట్లు కలెక్టర్‌కు తహశీల్దార్ కూర్మనాథరావు తెలిపారు.

వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, నాయకులు

అధికార దాహంతోనే హామీలు

- వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి
- మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికలకు ముందు అధికార దాహంతో టిడిపి కూటమి హామీలు గుప్పించిందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆ హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రశ్నించేందుకే ఈనెల 4న వెన్నుపోటు దినం పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్ఘాటించారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం కరపత్రాలను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ చంద్రబాబువి ఎప్పుడూ వెన్నుపోటు రాజకీయాలేనని వ్యాఖ్యానించారు. నాడు కీర్తిశేషులు ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిస్తే.... నేడు ఐదు కోట్ల మంది ఆంధ్రులను వెన్నుపోటు పొడిచారని చెప్పారు. ఈ నెల 4న నగరంలోని సిఎంఆర్ జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోలగట్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు టెంకల అచ్చెన్నాయుడు, ఎస్‌వివి రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

యువత ప్రాణాలు కాపాడటమే ధ్యేయం

'ఇటీవల కాలంలో యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం.. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం.. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. భావితరాలకు పనికి వచ్చే యువత అనతి కాలంలో మృతి చెందుతున్నారు. యువత ప్రమాదాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామ'న్నారు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ డి.మణికుమార్. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 28 డ్రైవింగ్ స్కూళ్లకు నోటీసులు ఇచ్చామని వివరించారు. వాహన వేగాన్ని గుర్తించే స్పీడ్ లేజర్ గన్ అందుబాటులో వచ్చిందని వెల్లడించారు. మరిన్ని వివరాలు..

– ప్రజాశక్తి, కంటోన్మెంట్

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు
- లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు
- 28 డ్రైవింగ్ స్కూళ్లకు నోటీసులు
- రవాణా శాఖ ద్వారా రూ.141 కోట్ల ఆదాయమే లక్ష్యం
- 'ప్రజాశక్తి'తో డిటిసి డి.మణికుమార్ ముఖాముఖి



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నాం. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రైవింగ్‌కు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. రవాణాశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. మైనర్లు వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లు వాహనాలను నడుపుతూ తనిఖీల్లో దొరికితే మైనర్లతోపాటు వారి తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తాం. మైనర్లు వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. యువత ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉంది. రేపటి భావితరాలు అభివృద్ధి చెందాలంటే యువత రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. లారీ, ఆటో, వ్యాన్, బస్సులను నడిపే డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తోంది.?

ప్రతి ఏడాది ప్రభుత్వం విజయనగరం జిల్లా రవాణా శాఖకు పన్నుల రూపంలో ఆదాయాన్ని లక్ష్యంగా విధిస్తుంది.



గత ఏడాది రూ.119 కోట్లు ప్రభుత్వం లక్ష్యంగా విధిస్తే పూర్తి చేశాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.141 కోట్లను లక్ష్యంగా పెట్టుకున్నాం. సకాలంలో పూర్తి చేస్తాం. వివిధ రూపాల్లో పన్నుల ద్వారా ఈ మొత్తాన్ని పూర్తి చేస్తాం.

జిల్లాలో వాహనాల వేగాన్ని గుర్తించే స్పీడ్ లేజర్ గన్ అందుబాటులో ఉందా.?

జిల్లాలో వాహనాల వేగాన్ని గుర్తించే స్పీడ్ లేజర్ గన్ రిపేరులో ఉండేది. దీనికి మరమ్మతులు చేయించాం. ఇక నుంచి ప్రతిరోజూ స్పీడ్ లేజర్ గన్‌ను ఉపయోగిస్తాం. సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న వాహన వేగాన్ని గుర్తిస్తుంది. పరిమితికి మించి వేగంగా వాహనం నడిపితే కేసు నమోదు చేస్తాం.

జిల్లాలో ఎన్ని డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి.? కొన్ని డ్రైవింగ్ స్కూళ్లు నిబంధనల ప్రకారం లేవనే విమర్శలు వస్తున్నాయి.?

జిల్లాలో మొత్తంగా 28 డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. అందులో 25 ఫోర్ వీల్ డ్రైవింగ్ ఇచ్చే డ్రైవింగ్ స్కూళ్లు. 3 హెవీ డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రైవింగ్ స్కూళ్ల నిర్వహణ ఉండాలి. అలా కాని డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లాలో ఉన్న 28 డ్రైవింగ్ స్కూళ్లకు నోటీసులు జారీ చేశాం. పూర్తి నివేదిక వచ్చాక ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నడవని డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం

జిల్లాలో రవాణా శాఖలో ఎన్ని వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి.?

జిల్లాలో ఇంతవరకు ఐదున్నర లక్షల వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇందులో ద్విచక్రవాహనాల రిజిస్ట్రేషన్ నాలుగున్నర లక్షల వరకూ ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. వాహనాలను తనిఖీ చేసి అన్ని ధ్రువపత్రాలు లేని వాహనాలను రవాణా శాఖ కార్యాలయంలో పెట్టి, కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

రవాణా శాఖ కార్యాలయంలో దళారుల వ్యవస్థతో పనులన్నీ జరుగుతాయనే ప్రచారం ఉంది.?

అటువంటిది ఏమీ లేదు. ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించిన కొన్ని పనులను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా చేస్తోంది. కొన్ని పనులను మాత్రమే రవాణా శాఖ కార్యాలయం ద్వారా జరుగుతున్నాయి. ప్రజలను ఎటువంటి అవసరమైనా నేరుగా రవాణా శాఖ అధికారులను కలవవచ్చు.

బాధితురాలికి చెక్కును అందిస్తున్న గొంప కృష్ణ

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన ముక్క బంగారమ్మ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఎంపి శ్రీభరత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిఎంతో మాట్లాడి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8లక్షలు మంజూరు చేయగా ఆ చెక్కును ఆదివారం బంగారమ్మకు గొంపకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, తెలుగు యువత రైతు సంఘం ఉపాధ్యక్షుడు సిరికి రమణ పాల్గొన్నారు.

ఘనంగా గొంప కృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ జన్మదినోత్సవాన్ని టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గానికి చేసిన పలు సేవలను వివరించారు. అనంతరం పార్టీ నాయకులు అభిమానులు ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాకేరులో పండగ సందడి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరులో ఆదివారం గుండాలమ్మ, పైడితల్లి అమ్మ వారు, శ్రీకృష్ణ స్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించి కలశాలను గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఇందులో భాగంగా సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం చేపట్టనున్నారు. అనంతరం విగ్రహాలు ప్రతిష్ఠ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ బుద్ద చిన్నమ్మ దంపతులు కోరారు.

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టండి

ప్రజాశక్తి - కొత్తవలస

అనాథలకు, ఒంటరి వృద్ధులకు ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టాలని ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరి కుమార్ అన్నారు. ఆదివారం తుమ్మికాపల్లి గ్రామం వద్ద 45 మంది వృద్ధులకు 12 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. విశ్రాంతి ఉపాధ్యాయులు బొడ్డు ప్రభాకర్ రావు మాస్టర్, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బొడ్డు వనజాక్షి చేతులు మీదుగా అందజేశారు. వనజాక్షి కూతురు భవ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా 45 మంది ఒంటరి వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, సభ్యులు గోవిందరావు, గణేష్, నగేష్, ప్రకాష్, ఉసురు, నిర్మల్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీగా హరీష్

ప్రజాశక్తి - భోగాపురం

వైసిపి రాష్ట్ర యువజన విభాగం కమిటీ జనరల్ సెక్రటరీగా భోగాపురం గ్రామానికి చెందిన సుందర హరీష్‌ను పార్టీ ఎంపిక చేసింది. భోగాపురం గ్రామానికి చెందిన కీర్తిశేషులు సుందర గోవిందరావు వైసిపిలో చురుగ్గా పనిచేసేవారు. ఆయన కుమారుడైన హరీష్ తండ్రి చనిపోయినప్పటి నుంచి అదే పార్టీలో కొనసాగి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేవారు. దీంతో పార్టీ గుర్తించి ఆయనకు ఈ పదవిని ఇచ్చింది. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

4న వెన్నుపోటు దినం

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటుపొడిచారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈనెల 4న జరగనున్న వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసం కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వాలంటీర్లను, ఎండియు ఆపరేటర్లను అన్యాయంగా తొలగించి రోడ్డున పడేసారని ఆరోపించారు. వెన్నుపోటుకు వ్యతిరేకంగా జరగనున్న నిరసనను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలగిన విద్యుత్తు సమస్యలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న సిబ్బంది

మండలంలోని బైరిపురంలో ఎస్‌సి వీధి, కృష్ణాకాలనీలో గత కొంత కాలంగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో ఆ ప్రాంత వాసులు విద్యుత్తు కష్టాలను ఎదుర్కొన్నారు. ఈ విషయం గ్రామ సర్పంచ్ పప్పల విజయకుమారి, ఉపసర్పంచ్ పప్పల కృష్ణ మూర్తి దృష్టికి వెళ్లగా అధికారులతో మాట్లాడి నూతనంగా ఆదివారం ట్రాన్స్‌ఫార్మరలను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు విద్యుత్తు కష్టాలు తొలగాయి.

50శాతం రాయితీపై పశుదాణా

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్



మండల వ్యాప్తంగా పాడి పశువులు ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా పంపిణీ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభిస్తున్నామని మరుపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ బివి రమణ ప్రజాశక్తికి తెలిపారు. మండలానికి మొదటి విడత కింద పశువుదాణా బస్తాలు 150, రెండో విడత కింద 300 బస్తాలు వచ్చాయని తెలిపారు. వీటి విలువ మార్కెట్లో 1100 రూపాయలు ఉండగా 50 శాతం రాయితీపై 555 రూపాయలకు సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. పశుదాణా కావాల్సిన పాడి రైతులు రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించి ఆధార్ కార్డుతో 550 రూపాయలు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మండలంలో సబ్సిడీ పశుదాణాలను పంపిణీ చేయడానికి కాలం రాజుపేట, కొణిశ జంక్షన్, తుమ్మికాపల్లి, మరుపల్లి నాలుగు స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశామని వాటి దగ్గర్లో ఉన్న గ్రామాలు నుంచి రైతులు తమ గ్రామాలకు తీసుకుని వెళ్లవచ్చునని అన్నారు.

రేషన్ డిపోలతో అక్రమాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకే రేషన్ దుకాణాలు ద్వారానే సరుకులు అందిస్తున్నామని ప్రజలంతా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని వన్వే జంక్షన్ వద్ద గల రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే పున ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని పోర్టుల్లో పట్టుకున్నామని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపిందని వీటిని అరికట్టేందుకు రేషన్ షాపుల ద్వారానే సరుకులు అందిస్తామని చెప్పారు. ఇంటింటికి రేషన్ అని రూ.1600 కోట్లతో వాహనాలు కొని జంక్షన్‌లో పెట్టి ఒకటి రెండు రోజులు మాత్రమే అందించే వారన్నారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారి పనులు మానుకోవాల్సి వచ్చేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రామణాజీ, భీశెట్టి అరుణ, పొట్నూరు సాయిరాం, చక్క కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, కాపుగంటి వాసు, పెదగాడ రాజు, గనివాడ లక్ష్మి, బోనంగి జ్యోతి, చిన్ని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: మండలంలోని జగ్గాపురం, గొర్లిపేట గ్రామాలలో రేషన్ దుకాణాలను టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు గొర్రిపాటి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపల్లి అప్పలనాయుడు, నాయకులు బొత్స అప్పలనాయుడు, ఆదినారాయణ డీలర్లు పాల్గొన్నారు.

బొబ్బిలి: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, తహశీల్దార్ ఎం.శ్రీను కోరారు. పట్టణంలోని దావాలవీధిలో ఆదివారం రేషన్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి ఆర్.సాయికృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పిన్నవలస, రామచంద్రాపురంలో ఆదివారం రేషన్ షాపులను వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్.సత్యం, బడి సురేష్, వెంకటేష్, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు తనిఖీ

నెల్లిమర్ల: నగర పంచాయతీలో నూతనంగా ప్రారంభించిన రేషన్ డిపోలను కమిషనర్ ఎ. తారక్ నాథ్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని, కొలతల్లో తేడా లేకుండా చూడాలని ఆదేశించారు.

ఎస్‌కోట: రేషన్ సరుకులను పేదలకు అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

వేపాడ: మండల కేంద్రంలో ఆదివారం తహశీల్దార్ జె.రాములమ్మ రేషన్ దుకాణాలను పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా డీలర్లతో సమావేశమై నిత్యవసర సరుకులను సకాలంలో అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు వంటాకు కృష్ణ, నియోజకవర్గం మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, సర్పంచ్ ఎం. అర్జునమ్మ, ఎంపిటిసి గంగ తల్లి, డీలర్లు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: మండలంలో 32 చౌక ధర దుకాణాలు ఆదివారం ప్రారంభించారు. కాలం రాజుపేట, మరుపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఆధ్వర్యంలో ఆదివారం రేషన్ షాపులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మరుపల్లి సర్పంచ్ లెంక రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వచ్చిన తరువాతే పేదవాడికి కడుపునిండా భోజనం

చీపురుపల్లి: ఎన్‌టి రామారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో పేదవాడికి కడుపునిండా మూడు పూటలా భోజనం దొరికిందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలో గల 13వ నెంబర్ రేషన్ షాపులో ఆయన రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల సరఫరా వాహనాలు నిలుపుదల చేస్తూ డీలర్లకు పూర్తి బాధ్యతను అప్పజెప్పినట్లు తెలిపారు. వాహనాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీలు కోట్లాది రూపాయల అవకతవకులు జరిగాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కాము నాయుడు, కనకమాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, ఆర్‌ఎస్‌ఎస్ మాజీ చైర్మన్ రామచంద్రుడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముల్లు రమణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు నీలకంఠ మాస్టర్, గరివిడి, మెరకముడిదాం మండల అధ్యక్షులు సారిపాక సురేష్, తాడ్డి సన్యాసినాయుడు, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. రామారావు తహశీల్దార్ ఎం.రాజారావు, రావివలస సర్పంచ్ పనస మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని ముంజేరులో రేషను సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లోకం మాధవి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సురేష్, సిఎస్‌డిటి మురళీకృష్ణ, సర్పంచ్ నూకరాజు, నాయకులు లోకం ప్రసాద్, పడాల శ్రీనివాసరావు, వందనాల రమణ పాల్గొన్నారు. రాజాపులోవ, లింగాలవలస, పోలిపల్లి గ్రామాలలో మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ రేషన్ డిపోలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుగత లలిత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కాపు రామారావు ఆధ్వర్యంలో ఆయన నిర్వహించే డిపోలో తహశీల్దార్ సులోచనారాణి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయాల్లో రెండు పూటల నెలలో 15 రోజులు సరకులు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

నాసిరకం సరుకుల సరఫరా: గద్దె

చీపురుపల్లి: ఉమ్మడి రాష్ట్రాలకు సరఫరా జరుగుతున్న నిత్యావసర సరుకులలో భారీగా కల్తీకి పాటుపడుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు ఆరోపించారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యావసర సరుకుల సరఫరాకు చీపురుపల్లి నుంచి టెండర్లు ఖరారు అయ్యాయన్నారు. టెండర్లలో మేలు రకం వస్తు సరఫరాకు హామీలను ఇస్తూ నాసిరకం సరుకులను సరఫరా చేయడానికి చీపురుపల్లిని కేంద్రంగా ఎంచుకున్నారన్నారు. ప్రస్తుతం రాయలసీమలో నాలుగు జిల్లాలకు 52 కోట్ల రూపాయల టెండర్లు స్థానిక వ్యాపారులు దక్కించుకున్నారన్నారు. టెండర్లల్లో చూపే విధంగా కాకుండా నాసిరకం నిత్యవసర సరుకులను సరఫరా చేస్తున్నారన్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తును జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గద్దె బాబురావు కోరారు. మొబైల్ వాహనాల ద్వారా రేషన్ సరుకులను సర్టైజ్ చేసే విధానానికి రాష్ట్ర పౌర సరఫరా శాఖ డైరెక్టర్‌గా ఇప్పటికే తాను పాల్గొన్న సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశానన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు సంబంధిత శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా తన ప్రతిపాదనను పరిశీలించారన్నారు. బియ్యం అక్రమ రవాణాకు మొబైల్ వాహనాలు ప్రధాన పాత్ర కావడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మూలించడం హర్షణీయమన్నారు.

చీపురుపల్లి: బియ్యాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

భోగాపురం: రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

మీ పిల్లల భవిష్యత్తు .. మీ చేతుల్లోనే!

సెంచూరియన్‌లో తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థుల భవిష్యత్తు వారి తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి అన్నారు. ఆదివారం బిఎస్‌సి అగ్రికల్చర్ కోర్సు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి కోసం అన్ని రకాల జాగ్రత్తలూ తీసుకుంటున్నామన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పిల్లల మంచి, చెడుల గురించి పిల్లలకు విడమరచి చెప్పేవారని, నేడు ఎవరికి వారే కుటుంబంగా ఏర్పడటం వల్ల ఈ సమస్య ఎక్కువగా ఉందని అన్నారు. ఎదిగే వయసులో పిల్లలు తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీన్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ వ్యవసాయ విద్యలో గల ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ఏయే రంగాల్లో ఎలాంటి శిక్షణనిస్తొన్నారో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ వ్యవసాయ రంగం దేశానికి వెన్నెముక వంటిదని అటువంటి రంగంలో తమ పిల్లలను చదివిస్తొన్న తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఎలా సంసిద్ధులు కావాలో వివరించారు. డాక్టర్ మాధవరావు పరీక్ష విధానం గురించి తెలిపారు. ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు మాట్లాడుతూ విద్యార్థుల విషయంలో తీసుకునే మంచి నిర్ణయాలు జీవితాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తాయని, తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే అదఃపాతాళానికి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. అనంతరం డీన్ డాక్టర్ సన్నీ డయాల్ తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ పల్లవి

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత నెల రోజులుగా సాగుతున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం శనివారం రాత్రితో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు హాజరై మాట్లాడారు. పిల్లలకు నెల రోజుల శిక్షణ భవిష్యత్తులో ఉపయోగపడుతుందన్నారు. కోచ్ శ్రీరాములు మాట్లాడుతూ ఈ శిక్షణా శిబిరానికి రూ.1.80లక్షలు ఖర్చయిందని దానికి ఇందుకూరి రఘురాజు వారి మిత్రబృందం, గ్రామంలో ఉండే దాతలు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ శిక్షణా శిబిరంలో 105 మంది క్రీడాకారులు శిక్షణ పొందారని, క్రీడాకారులందరికీ క్రీడా దుస్తులను, రోజు ఉదయం పౌష్టికాహారంగా గుడ్డు పాలు సాయంత్రం నిమ్మరసం అందించామని ప్రతి ఆదివారం ఆటవిడుపుగా విహారయాత్రలకు పుణ్యగిరి స్విమ్మింగ్ పూల్‌కి కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల బస్సు మీద తీసుకెళ్లామని చెప్పారు. పాఠశాల క్రీడామైదానంలో ఏడు షటిల్ కోర్టులను ఏర్పాటు చేసి 14 మంది రాష్ట్ర స్థాయి క్రీడాకారులను కోచ్‌లుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ శిబిరానికి శిక్షకులుగా వ్యవహరించిన ఎండి అస్లాం, బి హారిక, మౌనిక ఇతర కోచ్‌లను అభినందించారు. అనంతరం గత మూడు రోజులుగా నిర్వహించిన టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మిత్ర బృంద సభ్యులు డాక్టర్ ఎస్‌వి సత్యకర్, ఏఎస్ వెంకట్రావు, మంథ సుబ్బారావు, ఆనల రమేష్, మల్ల రామకృష్ణ, కె గోవిందరావు, కె సాయితేజ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ

జెసి రాజుకు ఎన్‌టిఆర్ అవార్డు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్వర్గీయ పద్మశ్రీ ఎన్‌టిఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని విజయవాడ సిద్దార్థ ఆడిటోరియంలో ప్రముఖ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఎక్సరే ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ స్మారక పురస్కార అవార్డును ఆదివారం బొబ్బిలికి చెందిన జెసి రాజు అందుకున్నారు. ప్రముఖ సామాజిక సేవకులు కారుణ్య ఫౌండషన్, రోటరీ సంస్థల చైర్మన్ ఉపాధ్యాయులు జెసి రాజుకు ప్రముఖ సినీ నటుడు, నటకిరీటి రాజేంద్రప్రసాద్, పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, అవని గడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా జెసి రాజును దుస్సాలువాతో సత్కరించి, ఎన్‌టిఆర్ ప్రతిమను, ప్రశంసా పత్రాన్ని అందించి ఎన్‌టిఆర్ అవార్డ్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ మహనీయుడు, విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్ ఎన్‌టిఆర్ పేరున అవార్డును అందుకోవడం గౌరవం, గర్వంగాను ఉందన్నారు. అవార్డును ప్రముఖ సినీ నటులు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందుకోవడం చిరస్మరణీయమైన అనుభూతని మిగిల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సరే అధ్యక్షులు కొల్లూరి, సిద్దార్థ కాలేజ్ ప్రధానాచార్యులు యెస్ పద్మ, ప్రముఖ వైద్యులుడాక్టర్ వేణు గోపాల రెడ్డి, డాక్టర్ మనోజ్ కుమార్, కన్వీనర్ బ్రహ్మదేశం వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున జెసి రాజు

గంజాయి అక్రమ రవాణా నివారణకు చెక్‌పోస్టులు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఒడిషా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి రవాణా నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎనుబరువు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే 6 లైన్ల రోడ్డును ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఒడిషా నుంచి ఎక్కువగా గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం ఉందని ఈ రోడ్డులో మరో కొత్త చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పాచిపెంట మండలం మాతుమూరు వద్దగానీ, హెచ్‌ఐ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఆఫీసు వద్దగానీ చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు. అందుకే ఈ రెండు ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఇప్పటికే రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద ఒక చెక్ పోస్టు నిర్వహిస్తున్నామని దీని ద్వారా ఇటీవల కాలంగా గంజాయి అక్రమ రవాణాను నిరోధించామని తెలిపారు. హైవేపై ఎక్కువగా గంజాయి రవాణా జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఏదిఏమైనప్పటికీ ఈ ప్రాంతంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని ప్రయత్నాలూ ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దంపతులు

దావాలపేటలో ఘనంగా అమ్మవారి పండగ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని దావాలపేట గ్రామంలో మహంకాళి అమ్మ పండగ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీనికి ముందు గ్రామంలో ఘటాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, దావలపేట మాజీ సర్పంచ్ ప్రసాద్, పలు గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవతావాది గొల్లపూడి ఇకలేరు

తనదేహాన్ని వైద్య కళాశాలకు దానం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గరికివలస గ్రామానికి చెందిన గొల్లపూడి సత్యనారాయణ మూర్తి శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. తన మరణం అనంతరం మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్థానిక మిమ్స్ వైద్య కళాశాలకు దానం చేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ క్రతువులు, కర్మకాండలు, సాంప్రదాయ బద్దాలను పక్కనపెట్టి, తన మృతదే హాన్ని మొదట అనుకున్న ప్రకారం దానం చేయడానికి ముందుకు రావడంతో ఆయన కుటుంబ సభ్యులను పలువరు అభినందిస్తు న్నారు. ఆదివారం గొల్లపూడి పార్థివ దేహానికి బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ బిజెపి జిల్లా అధ్య క్షులు రెడ్డి పావని, సహా పలువురు ప్రముఖులు పార్థివదేహాన్ని సందర్శించి బిజెపి జెండాను కప్పి ఘన నివాళి అర్పించారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం పట్టణం రామనారాయణం పరిసరాల్లో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేస్తున్న యువకుడ్ని వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం కాపాడి, కౌన్సిలింగ్ చేసి, వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సాలూరు పట్టణానికి చెందిన యువకుడు మనస్తాపం చెంది, ఇంటి నుండి బైకుపై బయలుదేరి, విజయనగరం చేరుకొని, తాను ఆత్మహత్య చేసుకుంటానని, తన కోసం వెతకవద్దని ఫోనులో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. యువకుని కుటుంబ సభ్యులు విషయాన్ని విజయనగరం వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్‌కు ఫోనులో తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన ఫోను నెంబరు ఆధారంగా యువకుడు ఉన్న ప్రాంతాన్ని గుర్తించాడు. ఈ లోపు అతనితో ఫోన్‌లో మాట్లాడిస్తూ సిగ్నెల్ ఆధారంగా అతని ఉన్న ప్రాంతాన్ని గుర్తించి యువకుడ్ని రైల్వే ట్రాక్ నుంచి బయటకు లాక్కొచ్చి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం అతన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చాకచక్యంగా పనిచేసిన సిఐను, సిబ్బంది జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

స్కూటీ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై రాజాపులోవ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. భీమిలి మండలం టి.నగరపాలేనికి చెందిన గడదాసరి సాయి (27) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్కూటీపై రాత్రి పదిన్నర ప్రాంతంలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడి తీవ్రంగా గాయ పడ్డాడు. వెంటనే విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక టిబిఆర్ థియేటర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. రామభద్రపురం నుంచి బొబ్బిలి ద్విచక్ర వాహనంపై వెలుతున్న మహిల వెనుక కూర్చుడంతో చీర బైక్ చక్రంలోకి వెళ్లి పోయింది. దీంతో ఆమె రోడ్డుపై పడిపోయి తలకు బలమైన గాయమైంది. స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT:: VIZIANAGARAM
IP No.22/2023

Between:
Battula Vijayamma ......Petitioner
And:
K.Naryanamma and 12 others..Respondents
To
R.06 N.Raju, W/o.Venugopal, Hindu, aged about 45 years, R/o.Telakala Veedhi, Vizianagaram Town & Mandal.
R.09 K.Suribabu, S/o.late Venkata Ramana, Hindu, aged about 53 years, C/o.Tiffin Shop, Gowda Veedhi, Vizianagaram Town & Mandal,
R.11 Kanakala Kalyani, W/o.Ramarao, Hindu, aged about 60 years, R/o.Near old Cinema Theatre, Maddi Village, Padmanabham Mandal, Visakhapatnam Dist.

PUBLIC NOTICE

Please take notice that the above matter posted to 17.6.2025 before the above Honourable Court for your appearance. You have to appear before the above said Honourable Court at **10.30 AM on dt.17.6.2025** personally or through an advocate with necessary documents on which you are relying. If you failed to do so, the matter will be decided in your absence as per Law.

SRI K.PHALGUNA RAO
Advocate,
Vizianagaram
VIZIANAGARAM
Dt.30.05.2025